# వక్రబుద్ధి

ఆ రోజు ఆఫీసుకురాగానే అందరికీ తెలిసిన వార్త - సుజాత, రవి విడాకులు తీసుకొన్నారు! ఆ వార్త విని ఆఫీసరునుంచి ప్యూన్ దాకా అందరూ నోళ్లు వెళ్లబెట్టేరు.

మొన్నకూడా వాళ్లిద్దరూ ఆఫీసులో నార్మల్‌గా అందరితో నవ్వుతూనే కాలం గడిపేరు. కల్సి ఇంటికి వెళ్ళారు. మరి విడాకుల్ని కోర్టువారు ఒక్కరోజులో ఇవ్వరుకదా?

ఇద్దరిమధ్యా ఏవో పొరపొచ్చాలుంటే వాటిని విజయవంతంగా ఇంతకాలం ఎలా దాచగలిగారు? అంత బాగా ఎలా నటించగలిగారు? అసలింతకీ విడాకులు తీసుకొన్నదెందుకు? ఇక ఇప్పుడేం చేస్తారు?

తలకొక రకంగా ఊహాగానాలు చేసేరు.

ఆ రోజు సుజాత, ముందు, ఆ తర్వాత రవి, ఆఫీసుకు విడివిడిగా వచ్చారు. మౌనంగా తమ పనులు చేసుకుపోతున్నారు.

రవికన్నా ఆఫీసులో సుజాత సీనియర్. సుజాతే రవిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. అప్పుడంతా సుజాత అదృష్టాన్ని అభినందించారు.

ఎందుకంటే రవి చాలా గొప్ప అందగాడు.

విడాకులు తీసుకొన్న వార్తను ఇద్దరూ అంగీకరించారు. కానీ ఆ తర్వాత అడిగిన ప్రశ్నలకు, సందేహాలకి ఏ ఒక్కరూ సమాధానం ఇవ్వలేదు.

అయితే రవి ముందు, ఆ తర్వాత సుజాత, హౌస్‌లోన్‌కు అప్లైచేసినప్పుడు విడాకుల తంతు, వాళ్లిద్దరూ కల్సి లోన్ కోసం ఆడిన నాటకమేమో నన్న అనుమానం అందరికీ కలిగింది.

ఎందుకంటే భార్యాభర్తలుగా కల్సి వుంటే ఒకరికే లోన్ ఇస్తారు. కానీ విడిపోతే ఇద్దరికీ ఇస్తారు.

ఇద్దరూ కల్సే ఇల్లు కట్టేరు.

కానీ రెండు పోర్షన్లుగా కట్టేరు.

ఇంత జరిగినా ఇద్దరిలో ఏ ఒక్కరూ పెదవి విప్పలేదు.

ఆఫీసులో వారి సందేహాలు సందేహాలుగానే వుండిపోయాయి.

ఇంతలో ఉన్నట్లుండి ఒకరోజు రవి మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నాడన్న వార్త ఆఫీసులో గుప్పుమంది.

"ఏమ్మా సుజాతా. రవి మళ్లీ పెళ్ళి చేసుకోబోతున్నాడట! నీకేమైనా తెల్సా?" అంతా సుజాతను అడిగారు.

సుజాత అందరి ఎదుటా భోరుమని ఏడ్చింది.

ఆ తర్వాత అసలు విషయం చెప్పింది.

హౌస్‌లోన్ కోసమే ఇద్దరూ నాటకమాడేరు - విడాకులు తీసుకొన్నట్లు. కానీ రెండురోజుల క్రితం దాకా ఇంటికెళ్ళి భార్యాభర్తలుగానే జీవించారు.

గృహప్రవేశం అయ్యాక మళ్ళీ ఇద్దరూ పెళ్ళిచేసుకొనే షరతుపైనే విడాకులు తీసుకొన్నారు.

సుజాత ఆ గృహప్రవేశ సుముహుర్తం కోసం ఎదురు చూస్తోంది. కానీ ఇంత లోనే రవి ఆమెను నిలువునా ముంచాడు.

"ఇంటిలోన్ నాటకం ఆడి నన్ను మోసంచేసేవు. అవునా?" ఆ రాత్రి రవిని నిలేసింది సుజాత.

"అవును. నీకు విడాకులు ఇవ్వాలని నేను ఎప్పుడో నిర్ణయించుకొన్నాను. నువ్వు అందుకు అంగీకరించవు కదా? అందుకని ఇంటి లోన్ నాటకం ఆడేను"

"అదే ఎందుకని? నేనంటే ఇష్టం పోయిందా? అలాగైతే విడాకులు పుచ్చుకొన్నాక కూడా నాతో రహస్యంగా ఎందుకు సంసారం చేసేరు?"

"పెళ్ళి చేసుకోటానికి మరో అమ్మాయి దొరికిందాకా నీతో సంసారం చేసేను. అందులో తప్పేముంది?"

"అసలు నాకు విడాకులివ్వాలన్న దుర్బుద్ధి మీకెందుకు కలిగింది?"

"ఎందుకంటే... నా ఇల్లు నిలుపుకోవాలన్న కోరికను నువ్వు తీర్చలేకపోయావు కనుక!"

"అంటే...?"

"అర్థం కాలేదా? ఇన్నాళ్ళు నాతో కాపురం చేసి కూడా నా వంశానికి వారసుడిని ఇవ్వలేకపోయావు. నాకు పిల్లలు కావాలి."

"నాకు మాత్రం అక్కర్లేదా? మీకు వంశం నిలపటంకోసం పిల్లలు కావాలి. కానీ నా స్త్రీత్వం సంపూర్ణతను సంతరించుకొనేది పిల్లలకు నేను తల్లినవుతే నండీ... ఆ విషయం మీకు చెప్పుకొని ఎన్ని సార్లు బాధపడలేదు?"

"బాధపడి లాభమేమిటి? నువ్వు పైకి చెప్పుకొన్నావు. నేను పైకి చెప్పుకోలేదు.'

'"అవును రహస్యంగా నా గొంతు కోసేరు. కానీ ఇప్పుడు చేసుకోబోయే స్త్రీ ద్వారా కూడా పిల్లలు మీకు కలగకపోతే అప్పడేం చేస్తారు? ఆమెకూ విడాకులిస్తారా? పిల్లలు పుట్టకపోవడానికి నూటికి ఎనభైశాతం పురుషుడిలో లోపమే కారణమని మీరెక్కడా చదవలేదా? డాక్టర్ పరీక్షతో చక్కబడే వ్యవహారాన్ని విడాకులు, రెండో పెళ్ళిదాకా తీసుకువెళ్తారా? మీకు సిగ్గులేదూ? జ్ఞానంలేదూ?"

"అనవసరపు మాటలు వద్దు. ఈ రోజునుంచి మన జీవితాలు వేరు."

"అవును. మీలాంటి మోసగాడికి, వంచకుడికి, వక్రబుద్ధికి నేను దూరంగా వెళ్తున్నందుకు సంతోషిస్తున్నాను. నిన్ను నా మాజీ భర్తగా చెప్పుకోటానిక్కూడా సిగ్గుపడ్తాను. నాకు పుట్టబోయే బిడ్డకి కూడా నువ్వు తండ్రివని చెప్పను. వాడే అడిగితే నీ తండ్రి చచ్చిపోయాడని చెప్తాను."

"ఏమిటి? నీకు బిడ్డా? అంటే..."

"అదంతా నీకనవసరం"

అంటూ ఆమె వెళ్లిపోయింది - హుందాగా నడుచుకొంటూ!

స్వాతి సపరివారపత్రిక21.1. 84